క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కమలాపురం : స్థానిక సీఎస్‌ఎస్‌ఆర్ అండ్ ఎస్ ఆర్‌ఆర్‌ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. శనివారం పెద్దదర్గా సమీపంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, పాదాచారులకు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మజ్జిగ పంపిణీ చేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సమ్మర్ క్యాంపు

వేంపల్లె : పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి వనజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కథలు చదవడం, చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీషు, పాటలు, డ్రాయింగ్, చెస్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ముగిసిన విరామ బైబిల్ పాఠశాల తరగతులు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని యెహోవా రోహి ప్రార్థన మందిరంలో ఈనెల 1వ తేదీ నుంచి జరిగిన విరామ బైబిల్ పాఠశాల తరగతులు శనివారంతో ముగిశాయి. దైవ సేవకులు మధుబాబు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన వీబీఎస్ ఉపాధ్యాయులు జయకుమారి, మేరీ, స్నేహలతలు నిర్వహించిన ఈ తరగతులకు దాదాపు 1000 మంది విద్యార్థులు హాజరయ్యారు. విరామ బైబిల్ పాఠశాల ముగింపు సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దైవ సేవకులు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మినరసింహ స్వామి కల్యాణం

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ అవరణలో దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీలు

లింగాల : వెలిదండ్ల గ్రామంలో వరదరాజుల స్వామి కల్యాణోత్సవం సందర్భంగా శనివారం సీనియర్ విభాగం వృషభరాజములచే బండలాగుడు పోటీలను నిర్వహించారు. నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన నాగయ్యకు ఎద్దులు మొదటి, రెండు బహుమతులను సాధించాయి. మొదటి బహుమతి రూ.80వేలు, రెండవ బహుమతి రూ.60వేలు నాగయ్య ఎద్దులు సాధించడం ఈ పోటీలలో ప్రత్యేక సంతరించుకుంది. ఆర్కెస్ట్రా ప్రజలను అలరించింది. వెలిదండ్ల సర్పంచ్ విశ్వరూపజనార్ధన్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

వల్లూరు : క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వల్లూరు గ్రామ సచివాలయ పరిధిలోని లింగాయపల్లె, దిగువపల్లె సచివాలయ పరిధిలోని అంబవరం గ్రామాల్లో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకున్నా, ఏవైనా ఇతర సమస్యలు వున్నా తెలపండి పరిష్కరిస్తామని ఆయన ప్రజలను కోరారు. లింగాయపల్లె, అంబవరం గ్రామాల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరారు. అంబవరం గ్రామాన్ని దిగువపల్లె సచివాలయ పరిధిలో చేర్చడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని, స్మశానానికి వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించాలని కోరారు. వాటిని మంజూరు చేస్తామని అయన వారికి హామీ ఇచ్చారు.



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు కిషోర్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మురళీరెడ్డి, బాలిరెడ్డి, నారాయణరెడ్డి, లోకేశ్వరరెడ్డి, ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ అమరేశ్వరి, ఈఓ పీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఈలు పవన్, డానియల్ జోసెఫ్, ఏపీఎం శైలజ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూజీడీ పనులపై దృష్టి సారించండి

పులివెందుల టౌన్ : యూజీడీ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. మహిళలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పురోగతిపై సమీక్ష :

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తన చాంబర్‌లో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, సచివాలయ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సరఫరా పైపులైన్ పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.60 కోట్లకు చేపట్టబోయే పనుల ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే పట్టణంలో అవసరమైన ప్రతి చోట సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను ఏర్పాటు చేసేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పట్టణంలో ప్రతిరోజు నీటి సరఫరా జరగాలన్నారు. అక్రమ కొళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించే కార్యక్రమం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి అభివృద్ధి పని నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



పనుల పురోగతిపై సమీక్షిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

వైభవంగా శిరిబండి ఉత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామ సమీపంలోని కోరుకొండపై వెలసిన బోగాదమ్మ తిరునాల మూడు రోజులుగా కొనసాగుతోంది. శనివారం నిర్వహించిన శిరిబండి ఉత్సవం వైభవంగా సాగింది. అనిమెల, గంగిరెడ్డిపల్లె గ్రామానికి రైతులు తమ ఎద్దులచే శిరిబండిని అమ్మవారిగుడి చుట్టూ మూడు రౌండ్లు తిప్పారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు మండలంలోని ప్రజలు తరలిరాగా వారిలో పురుషులకంటే మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు కటారు శివరామిరెడ్డి సతీమణి రామలక్షుమ్మ రెండు రోజులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శిరిబండి ఉత్సవంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్‌ఐ రాజారమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



శిడిబండి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న రైతులు

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవం

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా పంచమ వార్షికోత్సవంను 8 వతేదీ నుంచి 10వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9వ తేదీలలో వివిధ పుజలతో పాటు 10వ తేదీ రాత్రి రాష్ట్రస్థాయి తాళాల భజన పోటీలు నిర్వ హిస్తారన్నారు. మొదటి బహుమతి రూ. 20,000 నుంచి మొత్తం 16 బహుమతులు అందజేయబడునని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 9966895195, 63016 81657 సంప్రదించాలని తెలిపారు.

ఎల్లమ్మ జాతరకు సహకరించండి

చెన్నూరు : నేడు జరిగే ఎల్లమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి ప్రజలను కోరారు. చెన్నూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఇరువర్గాల గ్రామపెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎల్లమ్మ జాతర సందర్భంగా ఊరేగింపులో ఎటువంటి గొడవలు జరగకుండా చూడాల్సిన బాధ్యత శాంతి కమిటీ సభ్యులపై ఉందన్నారు. మండల ప్రజలు జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. జాతరను పర్యవేక్షించడానికి డీఎస్పీతోపాటు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తుగా ఉంటారన్నారు. సమావేశంలో స్థానికులు భాస్కర్‌రెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు, పెదబల్లి ప్రదీప్ కుమార్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, మునీర్‌అహ్మద్, ఆసిఫ్ బాషా, పలువురు శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అశోక్‌రెడ్డి

పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ

పులివెందుల టౌన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత మెయిన్ పాఠశాలలో 91 మంది పరీక్షలు రాయగా.. 77 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. అలాగే వెంకటప్ప మోమోరియల్ ఇంగ్లీషు మీడియం స్కూలులో 67 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 66 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో 18 మంది విద్యార్థులు 540 మార్కులకుపైగా సాధించారు. నల్లపురెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన 147 మంది విద్యార్థులు పరీక్షలు రాగా.. 131 మంది ఉత్తీర్ణత సాధించారని హెడ్మాస్టర్ కమలనాథశర్మ తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 66 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 50 మంది ఉత్తీర్ణత సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలో 60 మంది పరీక్షలు రాయగా.. 38 మంది ఉత్తీర్ణత సాధించారు. రమణప్ప సత్రంబడి ఉన్నత పాఠశాలలో 142 మంది పరీక్షలు రాయగా.. 100 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

చక్రాయపేట : మండలంలోని నాగలగుట్టపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకరు 585 మార్కులు సాధించారు. మండలంలో 94 శాతం ఉత్తీర్ణులయ్యారు.

కమలాపురం : పట్టణంలో జ్యోతి బాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 550కి పైన ముగ్గురు విద్యార్థులు సాధించారు. చిన్నచెప్పలి జడ్పీ హైస్కూల్‌లు, పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌లు, నల్లింగాయపల్లె హైస్కూల్‌లు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. అలాగే మండలంలోని నల్లింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పోరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)కు చెందిన డీఏవీ భారతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణ సాధించారు. అలాగే 86 శాతం విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించారని ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్‌శివమ్ తెలిపారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని నాలుగు ప్రభుత్వ, ఒక్క ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా వాటిలో ఉరుటూరు, పాయసంపల్లె, ఎన్.పాలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండవ స్థానం, వీరపునాయునిపల్లె సంగమేశ్వర ఎయిడెడ్ పాఠశాల మూడవ స్థానంలో నిలిచింది.

జమ్మలమడుగు : మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నతపాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు వచ్చినట్లు ఎంఈఓ క్రిష్టఫర్ తెలిపారు. పట్టణ, మండల పరిధిలో మొత్తం 13 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 601 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 512 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్సియల్ పాఠశాలలో 98 శాతం ఫలితాలు సాధించినట్లు పాఠశాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థినులు 500 మార్కులు దాటిన వారు 30 మంది విద్యార్థినులు ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు.

లింగాల : లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 44 మందికి గాను 43, పెద్దకుడాల ఉన్నత పాఠశాలలో 23 మందికి గాను 21, కోమన్నూతలలో 27 మందికి గాను 23, పార్నపల్లెలో 50 మందికి గాను 40, , బోనాలలో 12 మందికి గాను 11, బాలయోగి ప్రతిభా గురుకుల పాఠశాలలో 66 మందికి గాను 62 మంది ఉత్తీర్ణులయ్యారు.

పెద్దముడియం : మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దముడియం పాఠశాలలో 24 మంది విద్యార్థులకు గాను 12, జంగాలపల్లెలో 12 మంది విద్యార్థులకు గాను 4, భీమగుండంలో 6 మంది విద్యార్థులకు గాను 5, గుండ్లకుంటలో 21 మంది విద్యార్థులకు 14, ఎన్.కొట్టాలపల్లెలో 15 మంది విద్యార్థులకు గాను 8, పెద్దపసుపులలో 54 మంది విద్యార్థులకు గాను 46, కేజీబీవీలో 31 మంది విద్యార్థులకు గాను 26 మంది ఉత్తీర్ణత సాధించారు.

తొండూరు : మండల వ్యాప్తంగా 74 శాతం ఉత్తీర్ణత శాతం వచ్చినట్లు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా.. అందులో 281 మంది ఉత్తీర్ణత సాధించారు.

చెన్నూరు : మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలు 364 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయగా 195 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు ఎంఈఓ స్టెల్లా షర్మిలా రాణి తెలిపారు.

పెండ్లిమర్రి : మండలంలోని ప్రభుత్వపాఠశాలల్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సుజాత తెలిపారు.

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా 842 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అందులో 602 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో 570 మార్కులపైన ఇద్దరు విద్యార్థులు సాధించారు.

ముద్దనూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో 67.26 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 333 మంది పరీక్షలకు హాజరుకాగా 224 మంది ఉత్తీర్ణత సాధించారు.

వేంపల్లె : పట్టణంలోని తలిశెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 78 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆ పాఠశాల హెడ్మాస్టర్ తెలిపారు. అలాగే జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 89.9శాతం సాధించారు. 570పైన మార్కులను నలుగురు విద్యార్థులు సాధించారు.

వేముల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 74శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం నాగాంజనేయులు తెలిపారు. ఇందులో ఫస్ట్ క్లాస్ 61మంది, రెండవ క్లాస్‌లో 28మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే కస్తూర్బా పాఠశాలలో 36 మందికి 34 మంది పాసైనట్లు పాఠశాల ఎస్ఓ శారదమ్మ తెలిపారు.

వల్లూరు : మండలంలోని గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 96 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 84 మంది ఉత్తీర్ణత సాధించారు. వల్లూరు జడ్పీ హైస్కూలుకు చెందిన 51 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 38 మంది ఉత్తీర్ణత సాధించారు. వల్లూరు కేజీబీవికి చెందిన 34 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా 29 మంది ఉత్తీర్ణులయ్యారు. గంగాయపల్లె జడ్పీ హైస్కూలుకు చెందిన 47 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 29 మంది ఉత్తీర్ణులయ్యారు.

నీటి సమస్య లేకుండా చూడండి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 7వ తేదీన ఆదివారం పులివెందుల పట్టణంలోని అన్ని ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని.. ప్రత్యామ్నాయంగా లోకల్ బోరు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఏదైనా అత్యవసర నీటి సరఫరాకు 8885105246 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలందరూ సహకరించాలన్నారు.

పొలతలకు ప్రతి సోమవారం బస్సు సౌకర్యం

జమ్మలమడుగు : జమ్మలమడుగు డిపోనుంచి ప్రతి సోమవారం శైవక్షేత్రమైన పొలతలకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు జమ్మలమడుగు నుంచి బయలుదేరిన బస్సు పది గంటలకు పొలతల చేరుకుంటుంది. సాయంత్రం మూడు గంటలకు పొలతల నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు డిపోకు చేరుకుంటుందన్నారు. పొలతలకు బస్సు చార్జీ రూ.195గా నిర్ణయించామన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మండలానికి జీలుగలు మంజూరు

చెన్నూరు : మండలానికి 183 క్వింటాలు జీలుగలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు ఎర్రసాని మోహన్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు తెలిపారు, ఈ సందర్భంగా వారు చెన్నూరు-1 రైతు భరోసా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 2023 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 183 క్వింటాళ్ల జీలగలు వచ్చాయని తెలిపారు. ఇవి రైతులకు సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. కిలో జీలుగలు ధర రూ.79 ఉండగా, ఇందులో రైతు వాటా రూ.39.50 ఉంటుందన్నారు. రామనపల్లెకు 50 కింటాళ్లు, చెన్నూరు-3కు 12 క్వింటాళ్లు, చెన్నూరు-1కు 20 క్వింటాళ్లు, ఉప్పరపల్లెకు 20 క్వింటాళ్లు, గుర్రంపాడుకు 50 క్విటాళ్లు, కనపర్తికి 6 క్వింటాళ్లు, శివాలపల్లికి 5 కింటాళ్లు, బయనపల్లెకి 20 క్వింటాళ్లు ఇవ్వడం జరిగిందన్నారు, రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకుని జీలుగలు తీసుకు వెళ్లాలని కోరారు. ఎకరాకు 10 కేజీల చొప్పున జీలగలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చరణ్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



జీలుగలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి, ఎంపీపీ

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

సింహాద్రిపురం : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం సింహాద్రిపరం చెత్త సేకరణ కేంద్రం వద్ద అసిస్టెంట్ ఇంజనీర్లు, పంచాయతీ సెక్రటరీ లబ్ధిదారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల కేంద్రంలో 324 ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరిగిందని.. వీటిలో 190 మాత్రమే పనులు పూర్తి కావస్తున్నాయని.. మిగిలిన లబ్ధిదారులు కూడా త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మంజునాథ, అసిస్టెంట్ ఇంజనీర్లు అమర్నాథ, లక్ష్మీకాంత్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ హరికిశోర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హంస వాహనంపై మోక్షనారాయణుడు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్షనారాయణుడు హంస వాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి జరుగుతున్న మోక్షనారాయణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : ఈనెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం లోక్ అదాలత్‌పై పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో కలసి ఆమె సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కక్షిదారులు గతంలో గొడవలు పడ్డ కేసులు, సివిల్ కేసులు తదితరు వాటిని పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి భార్గవి